తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ
గణతంత్ర దినోత్సవ హృదయ పూర్వక శుభాకాంక్షలు...
ఈ రోజు భారతీయులందరూ 70వ గణతంత్ర దినోత్సవాన్ని జాతీయ పండుగగా జరుపుకుంటున్నారు.
ఈ శుభసమయాన మన స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎందరో మహనీయులను, త్యాగమూర్తులను, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకోవడం మన విధి.
వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం ఈ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నాం.
వారి ఆశయాల మేరకు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి నా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది.
దేశంలో 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ నేడు ఒక సఫల రాష్ట్రంగా, జాతి నిర్మాణంలో చక్కటి పాత్ర పోషిస్తున్నది. గడిచిన నాలుగున్నర ఏండ్లు తెలంగాణ ప్రగతి ప్రస్థానానికి అద్భుతమైన ప్రారంభాన్ని ఇచ్చాయి. శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారి నేతృత్వంలో ఏర్పడిన మొట్టమొదటి ప్రభుత్వం అన్నిరంగాలలో పునర్నిర్మాణ ప్రక్రియను ఉజ్వలంగా చేపట్టింది. ఒకవైపు దృఢమైన నాయకత్వాన్ని అందిస్తూ మరోవైపు రాజకీయ స్థిరత్వాన్ని నెలకొల్పింది. ప్రగతి పథంలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించింది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో శాంతిని, సామరస్యాన్ని నెలకొల్పుతూ అన్నివర్గాల ఆదరాభిమానాలను చూరగొన్నది. అనతికాలంలోనే బాలారిష్టాలను అధిగమించి అద్భుత విజయాలను సాధించింది. ప్రజాసంక్షేమంలోనూ, అభివృద్ధిలోనూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల హృదయాలను గెలుచుకున్నాయి. అందుకనే గత ఎన్నికలలో ప్రజలు శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారి నేతృత్వానికి, వారి ప్రభుత్వ విధానాలకి మరోసారి పెద్దఎత్తున మద్దతు పలికారు. అఖండ విజయాన్ని అందించారు. రెండవసారి అధికార బాధ్యతలను చేపట్టిన ప్రభుత్వం తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి పునరంకితమవుతున్నది.

నేడు రాష్ట్రంలో రూ. 40 వేల కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయి. అందుకే తెలంగాణ ప్రభుత్వ పరిపాలనని సంక్షేమంలో స్వర్ణయుగంగా పేర్కొనటం సముచితం. దేశంలో

మరే రాష్ట్రం కూడా, సంక్షేమం కోసం, ఇంత పెద్దఎత్తున నిధులను కేటాయించటం లేదు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అనుసరించి వృద్ధాప్య పెన్షన్ అర్హత వయో పరిమితిని ప్రభుత్వం 57 ఏండ్లకు తగ్గిస్తున్నది. పెన్షన్ల మొత్తాన్ని రెట్టింపు చేసి ఇవ్వబోతున్నది.

తెలంగాణ ఉద్యమానికి ప్రధాన కారణం సాగునీటి డిమాండ్. అందుకే ప్రభుత్వం తెలంగాణ రైతాంగం ఆశలు నెరవేర్చడం కోసం, రాష్ట్ర వ్యాప్తంగా కోటి 25 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే బృహత్తరమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. ఈ ప్రయత్నంలో ప్రతిఘాతక శక్తులు కల్పించిన అనేక అవరోధాలను ఉక్కు సంకల్పంతో అధిగమించింది. అంతర్ రాష్ట్ర వివాదాలకు సామరస్య పరిష్కారాలను కనుగొన్నది. కేంద్రం నుంచి, వివిధ ప్రాధికార సంస్థల నుంచి అటవీ, పర్యావరణ, ఇతర అనుమతులను సాధించింది. శరవేగంగా ప్రాజెక్టుల నిర్మాణం సాగిస్తున్నది. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితాలు ఈ వర్షాకాలం నుంచే అందేవిధంగా ప్రభుత్వం తీవ్ర కృషి చేస్తున్నది. పాలమూరు- రంగారెడ్డి, సీతారామ, డిండి తదితర ప్రాజెక్టుల నిర్మాణపనులు అనతికాలంలో పూర్తిచేసేందుకు కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నది. ఈ ఐదేళ్ళ వ్యవధిలోనే, "సస్యశ్యామల తెలంగాణ" ఆకృతి దాల్చేవిధంగా ప్రభుత్వం ముమ్మరంగా కృషి చేస్తున్నది.

తెలంగాణకు బహుళ ప్రయోజనాలకు చేకూర్చే పథకం మిషన్ కాకతీయ. ఈ పథకం వల్ల నేడు రాష్ట్రంలో వేలాది చెరువులు పునరుద్ధరణకు నోచుకొని కళకళ లాడుతున్నాయి. నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. ఫలితంగా రాష్ట్రంలో భూగర్భ జలమట్టం గణనీయమైన స్థాయికి పెరిగింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు సాగునీటి కల్పన కోసం ప్రభుత్వం 99,643 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఏ ఈ ఏడాది మార్చి నాటికి మొత్తం లక్షా 7వేల కోట్లు ఖర్చువుతుంది. రాబోయే కాలంలో మరో లక్షా 17వేల కోట్ల అంచనాతో పనులు జరుతాయి. గోదావరి, కృష్ణ బేసిన్లలో తెలంగాణ రాష్ట్రానికున్న 1300 టిఎంసిల నీటి వాటాను

వాడుకోవడానికి, 2.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో పనులన్నింటినీ పూర్తి చేసి, కోటి 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నది.

ప్రజలకు అతి ముఖ్యమైన అవసరం తాగునీరు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ అనే బృహత్తర పథకం చేపట్టింది. దేశ చరిత్రలోనే అపూర్వమైన ఈ తాగునీటి పథకం దాదాపుగా పూర్తి కావచ్చింది. ఇప్పటికే రాష్టంలోని అన్ని మున్సిపాలిటీలకు, అన్ని జనావాసాలకు శుద్ధిచేసిన నదీజలాలు చేరుకున్నాయి. కొన్ని చోట్ల అంతర్గత పనులు జరుగుతున్నాయి. వచ్చే మార్చి మాసాంతానికి అన్ని ఆవాసప్రాంతాల్లో నల్లాలు బిగించే కార్యక్రమాన్ని కూడా పూర్తిచేసి ప్రతిఇంటికీ ప్రతిరోజు స్వచ్ఛమైన మంచినీరు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది.

సాగునీటి వసతులలో మెరుగుదల రావటంతో పాటు, 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుండటంతో రాష్ట్రంలో వ్యవసాయోత్పత్తి గణనీయంగా పెరిగింది. దేశంలో వ్యవసాయరంగానికి ఉచితంగా, నాణ్యమైన విద్యుత్తును, 24 గంటలపాటు సరఫరా చేస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని సగర్వంగా తెలియజేస్తున్నాను.

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధి కోసం తీసుకున్న చర్యలు విప్లవాత్మకమైన మార్పుకు దోహదపడుతున్నాయి. రైతులలో ఆత్మ విశ్వాసాన్ని, ఆశావహ దృక్పథాన్ని కలిగిస్తున్నాయి. రైతుబంధు పథకం జాతీయ ఎజెండాలో భాగంకావడమే కాకుండా ఐక్యరాజ్యసమితిచేత ప్రశంసలు పొందింది. అనేక రాష్ట్రాలు తెలంగాణ మార్గాన్ని అనుసరిస్తున్నాయి. రైతుబంధు, రైతుభీమా పథకాలతో తెలంగాణ దేశవ్యాప్తంగా ఒక రోల్ మోడల్ గా నిలవటం మనందరికీ గర్వకారణం. రైతుబంధు పథకం ప్రయోజనాలను సమర్థవంతంగా ప్రజలకు చేర్చడం కోసం ప్రభుత్వం ముందుగా సమగ్ర భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం చేపట్టింది. ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళన ప్రక్రియను సమర్థవంతంగా జరిపింది. 94 శాతం భూముల యాజమాన్య

హక్కులను తేల్చడమే కాకుండా రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండానే  కొత్త పాస్ బుక్కులను ప్రభుత్వం అందించింది. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత కోసం ఉద్దేశించిన “ధరణి” వెబ్ సైట్ త్వరలో ప్రారంభం అవుతుంది.

ఒకవైపు వ్యవసాయాన్ని కుదుటపరుస్తూనే, మరోవైపు వ్యవసాయ అనుబంధ వృత్తులను నిలబెట్టేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నది. కూలిన కులవృత్తులకు ఆర్థిక ప్రేరణతోపాటు  ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి, ఆ వృత్తులను  నిలబెట్టే కార్యక్రమాలు అమలుచేస్తున్నది.  తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టిని చేకూర్చడానికి ప్రయత్నిస్తున్నది. గొల్ల,కుర్మలకు గొర్రెల పంపిణీ, బెస్త ముదిరాజుల కోసం చెరువుల్లో చేప విత్తనాన్ని ఉచితంగా పోయడం, చేనేత కార్మికులకు నూలు రసాయనాలపై 50 శాతం సబ్సిడీ, నాయీ బ్రాహ్మణులు, రజకులు, గౌడ సోదరులు,  విశ్వకర్మలు తదితర కులాల వారికి వివిధ ప్రోత్సహకాలు అందిస్తున్నది.  రాష్ట్రంలో పాల ఉత్పత్తి పెరిగేందుకు బర్రెలను పంపిణీ చేయడమే కాకుండా పాల ఉత్పత్తిదారులకు ఆర్థిక  ప్రోత్సాహకాలను అందిస్తున్నది. అత్యంత వెనుకబడిన కులాల వారి అభివృద్ధికి ఎం.బి.సీ. కార్పొరేషన్ నెలకొల్పింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిననాడు భయంకరమైన విద్యుత్ సంక్షోభం వుండేది.   పరిశ్రమలకు పవర్ హాలిడేలు ప్రకటించేవారు.  కరెంట్  కోసం పారిశ్రామికవేత్తలు ధర్నాలు చేయాల్సిన దుస్థితి వుండేది.  వ్యవసాయానికి మూడు, నాలుగు గంటల కరెంట్ కూడా అందేది కాదు.   కాలిపోయే మోటార్లు, పేలిపోయే ట్రాన్స్ ఫార్మర్లతో రైతులు అవస్థలు పడేవారు.  పంటలు ఎండిపోయి ఆర్థికంగా బాగా నష్టపోయారు.  గృహ విద్యుత్ కూడా  గంటల తరబడి కోతలు విధించే వారు. తెలంగాణ ఏర్పడే నాటికి  2,700 మెగావాట్ల విద్యుత్ కొరత వుండేది.  ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి  రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభాన్ని  పరిష్కరించింది.   అన్నిరంగాలకు 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేరుతున్నది.   రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని  శరవేగంగా పూర్తి చేస్తున్నది.   800

మెగావాట్ల కే.టి.పి.ఎస్. 7వ దశ ప్లాంట్ ఇటీవలనే ఉత్పత్తి ప్రారంభించింది. 1080 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన భద్రాద్రి ప్లాంట్ నిర్మాణాన్ని కూడా శరవేగంగా పూర్తి చేసి ఈ ఏడాది నుండే విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించబోతున్నామనే శుభవార్తను ఈ శుభసందర్భంలో సగర్వంగా ప్రకటిస్తున్నాను. 4,000 మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం కూడా శరవేగంగా సాగుతున్నది. తెలంగాణ ఏర్పడిననాడు రాష్ట్రానికి 7,778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం మాత్రమే అందుబాటులో వుంటే.. నేడు 16,503 మెగావాట్ల స్థాపిత విద్యుత్ అందుబాటులో వుంది. తలసరి విద్యుత్ వినియోగం వృద్ధిరేటులో దేశంలోనే అగ్రస్థానం సంపాదించి ప్రగతికాముక రాష్ట్రంగా తెలంగాణ నిలబడింది.

నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పుడే ప్రజల జీవన ప్రమాణాల్లో గుణాత్మక మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం గట్టిగా నమ్ముతున్నది. ప్రపంచ వ్యాప్తంగా ప్రగతి కాముకులు గుర్తిస్తున్న మానవ ప్రగతి సూచికల్లో (హ్యూమన్ డెవలప్మెంట్ ఇండెక్స్) ప్రధానమైన ఈ రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నది.

రాష్ట్రంలో విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటైన విధంగా విద్యాబుద్ధులు నేర్పించడం కోసం, కే.జి. నుంచి పి.జి. ఉచిత విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం పెద్దఎత్తున రెసిడెన్షియల్ విద్యాలయాలను నెలకొల్పింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించడం కోసం, సకల వసతులతో కొత్తగా 542 రెసిడెన్షియల్ స్కూళ్ళను ప్రారంభించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్రంలో కొత్తగా మరో 119 బిసీ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభించుకోబోతున్నామని సంతోషకర వార్తను మీతో పంచుకుంటున్నాను. రాబోయే ఐదు సంవత్సరాలలో విద్యారంగం మరింత సమగ్రతను, పటిష్టతను సంతరించుకునే విధంగా, ప్రభుత్వం మరిన్ని సంస్కరణలను అమలుచేస్తుంది.

ప్రజల ప్రాణాలు నిలబెట్టే ప్రజారోగ్య వ్యవస్థను, పటిష్టపరిచే దిశగా ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని అన్ని దవాఖానాలలో వసతులను మెరుగు పరిచింది. ఆసుపత్రుల స్థాయిని సామర్థ్యాన్ని పెంచింది. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం, చికిత్స కోసం అధునాతన సాంకేతిక పరికరాలను సమకూర్చింది. ముఖ్యంగా ఆవాంఛనీయమైన ఆపరేషన్లకు అడ్డుకట్ట వేయాలని, ఆసుపత్రిలో  సురక్షిత  ప్రసవాలు పెరగాలనే ఉద్దేశ్యంతో "కే.సి.ఆర్ కిట్" పథకం ప్రవేశ పెట్టింది. ఈ పథకం  గొప్ప ఫలితాన్ని ఇచ్చింది. అదేవిధంగా  ప్రజలలో ఆరోగ్య స్పృహను కలిగించి, దృష్టి లోపాల నివారణ కోసం చికిత్స అందించటం కోసం ప్రవేశ పెట్టిన "కంటివెలుగు" పథకం దిగ్విజయంగా కొనసాగుతున్నది. త్వరలోనే చెవి, ముక్కు, గొంతు, దంత వ్యాధుల నివారణ కోసం వైద్య బృందాలతో ఊరూరా శిబిరాలు నిర్వహించే కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇందుకోసం ఇప్పటికే  ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ప్రభుత్వ ఆసుపత్రులలో మరణించిన పేదల మృతదేహాలను వారి స్వగ్రామాలకు ఉచితంగా చేర్చేందుకు ప్రభుత్వం పరమ పద వాహనాలను అందుబాటులోకి తెచ్చింది.

ప్రభుత్వ ఆసుపత్రులంటేనే అపనమ్మకం,అనుమానాలున్న పరిస్థితి నుంచి నేడు ప్రభుత్వం ప్రజా వైద్యంపై విశ్వాసం పెంచింది. ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య తెలంగాణ రాష్ట్రంలో 30 నుంచి 50 శాతానికి పెరిగింది. ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ప్రసవ సమయంలో మాతా, శిషు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. దేశంలో అత్యుత్తమమైన ప్రజావైద్యం అందుతున్న తొలి మూడు రాష్ట్రాల్లో నేడు తెలంగాణ ఒకటని నీతి ఆయోగ్ ఇటీవల ప్రకటించిన సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సూచిక (sustainable development goal index) 2018 లో పేర్కొనడం మనందరికీ గర్వకారణం.

పేదల నివాసాలు నివాసయోగ్యంగా, గౌరవ ప్రదంగా,  ఉండాలనే సదుద్దేశ్యంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా  తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం  రెండు పడక గదులతో కూడిన పక్కా ఇళ్ళను ఉచితంగా నిర్మించి ఇస్తున్నది. ఇప్పటికే  2.72 లక్షల ఇండ్ల నిర్మాణం పురోగతిలో

ఉన్నది. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రాబోయే రోజుల్లో పేద ప్రజలకు వారి స్వంత స్థలంలో రెండు పడక గదుల ఇల్లు నిర్మించుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఉచితంగా 5 లక్షల నుండి 6 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుంది.

రహదారులు సమాజ సంస్కృతికి అద్ధం పడతాయి. తెలంగాణ రాష్ట్రంలో రహదారులను మెరుగు పరిచి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించడానికి ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్నది. 3,150 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను సాధించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 2,527 కిలోమీటర్ల జాతీయ రహదారిమాత్రమే ఉంటే, నేడు రాష్ట్రంలో 5,677 కిలోమీటర్ల జాతీయ రహదారులు సమకూరాయి. హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విషయాన్ని పరిగణన లోకి తీసుకుని నగరం చుట్టూ, ప్రస్తుతమున్న ఔటర్ రింగు రోడ్డు అవతల 340 కిలోమీటర్ల పొడవైన రీజనల్ రింగు రోడ్డును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని నిర్ణయించింది.

రాష్ట్రంలో ప్రస్తుతమున్న రహదారులన్నింటికీ పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రహదారులన్నీ అద్దంలా రూపుదిద్దుకోవడానికి మిషన్ మోడ్ లో పనిచేస్తుంది. రాష్ట్రంలోని మొత్తం 12,751 గ్రామాలకు ఖచ్చితంగా బిటి రోడ్డు ఉండాలనే విధాన నిర్ణయం తీసుకున్నది.

రాష్ట్రంలో పారిశ్రామిక ఉత్పత్తి పెరగటమే కాకుండా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులు పొందే దగ్గర అధికారుల అలసత్వం ఇతర అవాంతరాలు చోటుచేసుకోని విధంగా టీ.ఎస్. ఐ- పాస్ చట్టం తెచ్చింది. ఈ చట్టం సత్ఫలితాలను ఇస్తున్నది. రాష్ట్రంలో జాతీయ అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు తమ ఉత్పత్తి

కేంద్రాలను నెలకొల్పుతున్నాయి. ఐ.టి రంగంలో నూతన అన్వేషణలకు వేదికగా నెలకొల్పిన "టీ-హబ్" అంకుర సంస్థలకు అండగా నిలుస్తున్నది.

పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం కోసం ప్రభుత్వం కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలు, గ్రామాలను ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటు చేసుకున్న 21 జిల్లాలకు తోడుగా త్వరలోనే నారాయణపేట, ములుగు జిల్లాలు కూడా ఏర్పాటు కాబోతున్నాయి. గిరిజన తండాలు, ఆదివాసీ గూడేలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలనే ఎస్టీల చిరకాల డిమాండును ప్రభుత్వం నెరవేర్చింది. 1,177తండాలు, గూడాలను కొత్తగా గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. 1,281 ఆవాస ప్రాంతాలు షెడ్యూల్డు ఏరియాలో ఉండడంతో అవి ఎస్టీలకే రిజర్వు అయ్యాయి. గ్రామాల్లో ఎస్టీల జనాభాను పరిగణలోకి తీసుకుని రాష్ట్రంలో 688 గ్రామాలను ఎస్టీలకు రిజర్వు చేసింది. దీంతో ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 3,146 మంది ఎస్టీలు సర్పంచులుగా ఎన్నికవుతున్నారు. ఇంతపెద్ద మెత్తంలో ఎస్టీలకు ప్రత్యేక పంచాయతీలను ఏర్పాటు చేసి, గ్రామపరిపాలనా బాధ్యతలను ఎస్టీలకే అప్పగించే అభ్యుదయ నిర్ణయం తీసుకున్న ప్రభుత్వంగా తెలంగాణ ప్రభుత్వం దేశ చరిత్రలో నిలిచిపోతుంది.

మహాత్ముడు ఆశించిన గ్రామ స్వరాజ్య భావనను బలోపేతం చేసే విధంగా  తెలంగాణ ప్రభుత్వం కొత్త పంచాయతీ రాజ్ చట్టాన్ని  రూపొందించింది. ఈ చట్టం స్థానిక  సంస్థల పనితీరు మెరుగుపడే విధంగా, ప్రజాప్రతినిధులకు ఒక చోదకశక్తిగా పనిచేస్తుంది. గ్రామ పాలన, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనాన్ని పెంపొందించుకోవడం మొదలైన అన్ని అంశాలలో పంచాయతీ వ్యవస్థలు ప్రభావ పూరితంగా క్రియాశీలకంగా వ్యవహరించే విధంగా  ప్రభుత్వం సంస్కరణలు చేపడుతున్నది.

అటవీ ప్రాంతాల రక్షణ, సామాజిక అడవుల పెంపకం విషయం లోను ప్రభుత్వం రాజీలేని వైఖరితో ముందడుగు వేస్తున్నది. మనిషి తన స్వార్థ ప్రయోజనాల కోసం విచక్షణా రహితంగా

ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నాడు. ఫలితంగా అనేక ఉత్పాతాలు సంభవిస్తున్నాయి. స్వచ్ఛమైన గాలికి కూడా కరువు ఏర్పడుతున్నది. అందుకనే ప్రభుత్వం దూరదృష్టితో పర్యావరణ పరిరక్షణ కోసం  దృఢ సంకల్పంతో పనిచేస్తున్నది.  అడవుల రక్షణ కోసం  కలప స్మగ్మర్ల పై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో నిర్వహిస్తున్నది.

నగరం చుట్టూ ఉన్న అటవీ ప్రదేశాలను నందనవనాల వలె మార్చేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతున్నది. కాలుష్య మయంగా మారిన మూసీ నదిని, పునర్జీవింప చేయటం కోసం ప్రభుత్వం నడుం బిగించింది.  కాళేశ్వరంతో మూసీ నదీ పరీవాహక ప్రాంతాన్ని అనుసంధానం చేయాలని సంకల్పించింది. మూసీకి ఇరుపక్కలా  గట్టు ప్రదేశాలను రమ్యంగా తీర్చి దిద్దేందుకు మూసీ రివర్ ఫ్రంట్ నిర్మాణం చేపట్టింది.  మూసీ ఒడ్డున జీవిస్తున్న  ప్రజలకు సమీపంలోనే చక్కని గృహాలను నిర్మించి ఇస్తున్నది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను కాళేశ్వరంతో అనుసంధించాలని ప్రభుత్వం సంకల్పించింది.

రాష్ట్రవ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ సవ్యంగా సాగుతున్నది. త్వరలోనే ప్రారంభమయ్యే పోలీస్ కంట్రోల్  కమాండ్ సెంటర్ అంతర్జాతీయ ప్రమాణాలతో పనిచేస్తుంది. దీంతో నిఘా వ్యవస్థ మరింత పటిష్ట పడుతుంది.  మహిళల రక్షణ కోసం నియోగించిన  షీ టీమ్స్ సమర్థవంతంగా సేవలను అందిస్తున్నాయి. ఈవ్ టీజింగ్ ను అరికట్టడంలో ఈ దళాలు విజయం సాధిస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్రం దేశంలో మరే రాష్ట్రానికి సాధ్యం కాని రీతిలో స్థిరమైన ఆదాయాభివృద్ధి రేటు సాధిస్తున్నది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి నాలుగు సంవత్సరాల్లో 17.17 శాతం వార్షిక సగటు వృద్ధి సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్ నాటికి 29.93 శాతం వృద్ధి రేటు సాధించి, దేశంలోనే ప్రథమంగా నిలిచింది. కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటించడం వల్ల, అవినీతి నిరోధానికి పటిష్టమైన విధానాలు అమలు చేయడం వల్ల ఈ ఆదాయాభివృద్ధి

సాధ్యమవుతున్నది. ఆదాయం పెంచాలి, ప్రజలకు పంచాలి అనే విధానం పెట్టుకున్న తెలంగాణ ప్రభుత్వం, పెరుగుతున్న ఆదాయాన్ని పేదలు, రైతులు, ఇతర అవసరమైన వర్గాల అభ్యున్నతికి వినియోగిస్తున్నది.

రాష్ట్రంలో ప్రస్తుతం అమలు జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలన్నింటినీ యధావిధిగా కొనసాగిస్తూనే, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త కార్యక్రమాలను ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

ప్రభుత్వం తదేక దీక్షతో తపస్సు వలె పనిచేయడం వల్లనే ప్రజలు గత ఎన్నికలలో తమ నిండు దీవెనలను అందించారు. రాబోయే కాలంలోనూ, ప్రజల ఆకాంక్షలే ప్రాతిపదికగా, ప్రభుత్వం వినూత్న పథకాలతో ముందుకు సాగుతుంది. పేదరికం, అశాంతి, అలజడి లేకుండా, పసిడి పంటలతో తులతూగుతూ, అన్నివర్గాల ప్రజలు సమాన అభివృద్ధిని పొందే బంగారు తెలంగాణ నిర్మాణం కోసం.. తెలంగాణ ప్రభుత్వం మనసా, వాచా, కర్మణా పునరంకిత మవుతుందని సవినయంగా ప్రకటిస్తున్నాను. యావత్ తెలంగాణ ప్రజానీకానికి మరోమారు భారత గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

జై హింద్! జై తెలంగాణ!!